# మన ఉద్యమం యొక్క జరూరు కర్తవ్యాలు

**వి.ఐ. లెనిన్**



*కామ్రేడ్ లెనిన్ ఈ వ్యాసాన్ని 1900 సంవత్సరం నవంబరులో రాశారు. అప్పటికి యూరప్ ఖండంలో పెట్టుబడిదారీ విధానం గుత్తపెట్టుబడిదారీ విధానంగా, సామ్రాజ్యవాదంగా పరివర్తన చెందుతోంది. మార్క్సిజాన్ని సవరించే పేరిట బెర్న్‌స్టైన్ వంటివారి నుండి రకరకాల రివిజనిస్టు ధోరణులు ప్రబలంగా ముందుకు వచ్చాయి. 1895లో ఏంగెల్సు మరణించేవరకూ, ఈ ధోరణులపై నిరంతరాయంగా పోరాడారు. రష్యాలో ఈ రివిజనిస్టు ధోరణులు ఒకపక్క, వీరులే చరిత్ర నిర్మిస్తారనే నరోద్నిజం భావజాలం ఒకపక్క వ్యాప్తిలో ఉన్నాయి. ఈ రెండు పెడధోరణులు శ్రామికవర్గం, ముఖ్యంగా కార్మికవర్గం యొక్క నాయకత్వ పాత్రనూ, కార్మికవర్గంలోకి వర్గపోరాట దృక్పధాన్ని కమ్యూనిస్టుపార్టీ అందించి, సామాజిక విప్లవాన్ని నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించ నిరాకరించేవే. లెనిన్ ఈ పెడధోరణులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటాన్ని సాగిస్తూనే, కార్మికవర్గంలో పార్టీ రాజకీయ కర్తవ్యాలతో సాగించాల్సిన కృషికి, ఆ సైద్ధాంతిక పోరాటాన్ని జోడించే వైఖరి తీసుకున్నాడు. కార్మికవర్గాన్ని విప్లవీకరించడం, కార్మికవర్గంలో విప్లవ పార్టీని నిర్మించడం అనే అత్యంత అవసరమైన కర్తవ్యాలు మన ముందున్న కాలంలో ఈ వ్యాసం ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నాము. 'జనాలలో పార్టీ కార్యకలాపాలు' అనే పేరుతో మాస్కో- ప్రగతి ప్రచురణాలయం ముద్రించిన లెనిన్ వ్యాసాలూ, ఉపన్యాసాల సంకలనంలోని ఈ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాము.*
– సంపాదకుడు

**రష్యన్** సోషల్ డెమోక్రసీ పదేపదే ప్రకటించింది, రష్యన్ కార్మికవర్గ పార్టీయొక్క తక్షణ రాజకీయ కర్తవ్యం నిరంకుశత్వాన్ని కూలదోయడమూ, రాజకీయ స్వాతంత్ర్యం సాధించడమూ అని. దీనిని పదిహేదేండ్లకంటే పూర్వం రష్యన్ సోషల్ డెమోక్రసీ ప్రతినిధులు– 'శ్రమ విమోచన' బృందం (ఫుట్ నోట్1)సభ్యులు ప్రకటించినారు. 1898 వసంతంలో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీని (ఫుట్‌నోట్.2) స్థాపించిన రష్యన్ సోషల్ డెమోక్రటిక్ సంస్థల ప్రతినిధులు దీనిని రెండున్నర సంవత్సరాల క్రితం ప్రకటించినారు. కానీ, పదేపదే యీ ప్రకటనలు చేయబడినప్పటికీ, రష్యాలో సోషల్ డెమోక్రసీయొక్క రాజకీయ కర్తవ్యాల సమస్య యీనాడు మళ్లీ ముందుకు వచ్చింది. మన ఉద్యమ ప్రతినిధులు చాలామంది సమస్యకు పైన చెప్పిన పరిష్కారం సరైనదా అని సందేహిస్తున్నారు. ఆర్థిక పోరాటం అధిక ప్రాముఖ్యం కలదని అంటున్నారు; కార్మికవర్గ రాజకీయ కర్తవ్యాలను పూర్వరంగంలోకి తోస్తున్నారు, కుదిస్తున్నారు, సంకుచిత పరుస్తున్నారు; రష్యాలో స్వతంత్ర కార్మికవర్గ పార్టీ నిర్మాణం గురించి మాట్లాడడం కేవలం మరొకరి మాటలు పునశ్చరణ చేయడమనీ, కార్మికులు ఆర్థిక పోరాటం మాత్రం సాగిస్తూ, రాజకీయాలను ఉదారవాదులకూ, మేధావులకూ వదలి వేయాలనీ కూడా అంటున్నారు. యీ కొత్త మతంలో తాజా విశ్వాసం (అపఖ్యాతి కెక్కిన Credo) (ఫుట్ నోట్.3) రష్యన్ కార్మికవర్గానికి యింకా యీడు రాలేదని అనడానికీ, సోషల్ డెమోక్రటిక్ కార్యక్రమాన్ని పూర్తిగా నిరాకరించడానికీ సమానం. 'రబోచయా మీస్ల్' (ముఖ్యంగా దాని 'విడి అనుబంధం'లో)(ఫుట్ నోట్.4) దాదాపు యిదే వైఖరి తీసుకుంటుంది. రష్యన్ సోషల్ డెమోక్రసీ స్వయం నిరాకరణలాంటి ఊగిసలాట, సందేహాల దశలో గడుస్తున్నది. ఒకవైపున కార్మికవర్గ ఉద్యమం సోషలిజం నుండి వేరుచేయ బడుతున్నది, ఆర్థిక పోరాటం చేయడానికి కార్మికులకు తోడ్పడుతున్నారు, కానీ మొత్తం ఉద్యమంయొక్క సోషలిస్టు లక్ష్యాలనూ, రాజకీయ కర్తవ్యాలనూ కార్మికులకు వివరించడానికి యేమీ చేయడంలేదు, లేదా దాదాపు యేమీ చేయుడంలేదు. మరొకవైపున సోషలిజం కార్మికోద్యమంనుండి వేరుచేయబడు తున్నది; కార్మికులు ఆర్థిక పోరాటానికి పరిమితమౌతారు గనుక ప్రభుత్వ వ్యతిరేక పోరాటం కేవలం మేధావులు సాగించవలసి వుండడం గురించి రష్యన్ సోషలిస్టులు అంతకంతకూ యెక్కువ మాట్లాడడం మళ్లీ ప్రారంభించినారు.

నా అభిప్రాయంలో, మూడు పరిస్థితులు యీ విచారకర సన్నివేశానికి ఆధారం తయారు చేసినాయి. మొదటిది, తమ మొదటి రోజుల కార్యకలాపాలలో రష్యన్ సోషల్ డెమోక్రట్లు కేవలం ప్రచార బృందాలలో పనిచేయుడానికి పరిమితమైనారు. మనం జనాలలో ఆందోళన ప్రారంభించినప్పుడు మనం ఆవలి కొసకు పోకుండా యెల్లప్పుడూ నిగ్రహించుకోలేక పోయినాము. రెండవది, మన మొదటి రోజుల కార్యకలాపాలలో మనం తరచు మన అస్తిత్వ హక్కుకోసం 'నరోద్నయ వోల్య' (ఫుట్ నోట్.5)

అనుయాయులతో పోరాడవలసి వచ్చింది; వాళ్లు "రాజకీయాలు" అంటే కార్మికవర్గ ఉద్యమం నుండి వెలువడిన కార్యకలాపాలుగా అర్థం చేసుకొని, రాజకీయాలను కేవలం కుట్రలతో చేసే పోరాటానికి కుదించినారు. యిలాంటి రాజకీయాలను నిరాకరించడంలో సోషల్ డెమోక్రట్లు సాధారణంగా రాజకీయాలను పూర్వరంగంలోకి నెట్టే కొసకు వెళ్లినారు. మూడవది, సోషల్ డెమోక్రట్లు చిన్న స్థానిక బృందాలకు వెలిగా పనిచేసన్తూ, స్థానిక బృందాల కార్యకలాపాలనన్నిటినీ కలిపి, విప్లవ పనిని సరైన పద్ధతులలో ఏర్పాటు చేయడం సాధ్యంచేసే, విప్లవ పార్టీని సంఘటితపరిచే అవసరంమీద తగినంత శ్రద్ధ అర్పించలేదు. ఏకాకి పనియొక్క ఆధిక్యం సహజంగా ఆర్థిక పోరాటపు ఆధిక్యంతో లంకె కలిగివుంటుంది.

యీ పరిస్థితుల ఫలితంగా ఉద్యమం యొక్క ఒక పార్శ్వంమీద మాత్రమే కేంద్రీకరించడం జరిగింది. యీ "ఆర్థికవాద" ధోరణి(దీనిని ఒక "ధోరణి" అనగలిగితే) యీ సంకుచితత్వాన్ని ఒక ప్రత్యేక సిద్ధాంత స్థాయికి లేవనెత్తడానికి ప్రయత్నించి, పాత బూర్జువా భావాలను కొత్త పేరుతో అమ్మజూపే ఫాషనబుల్ బెర్న్‌స్టైనిజంనూ, (ఫుట్‌నోట్.6) ''మార్క్సిజం విమర్శ''నూ యీ ప్రయోజనానికి వినియోగించుకోడానికి ప్రయత్నించింది. యీ ప్రయత్నాలే రష్యన్ కార్మికవర్గ ఉద్యమానికీ, రాజకీయ స్వాతంత్ర్యం కొరకు జరిగే పోరాటంలో అగ్రదళమైన రష్యన్ సోషల్ డెమోక్రసీకీ మధ్య వున్న సంబంధాన్ని దుర్బరపరిచే ప్రమాదాన్ని ఉత్పన్నం చేసినాయి. మన ఉద్యమం యొక్క అత్యంత జరూరు కర్తవ్యం, యీ సంబంధాన్ని పటిష్టపరచడం.

సోషల్ డెమోక్రసీ అనేది కార్మికవర్గ ఉద్యమంయొక్కా, సోషలిజంయొక్కా సమ్మేళనం. దాని కర్తవ్యం కార్మికవర్గ ఉద్యమానికి దాని ప్రతి ప్రత్యేక దశలోనూ నిష్క్రియాత్మకంగా సేవ చేయడం కాదు; దాని కర్తవ్యం మొత్తం ఉద్యమం యొక్క ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించడమూ, యీ ఉద్యమానికి దాని అంతిమ లక్ష్యాన్నీ, దాని అంతిమ రాజకీయ కర్తవ్యాలనూ చూపించడమూ, దాని రాజకీయ, సిద్ధాంత స్వాతంత్ర్యాన్ని రక్షించడమూ. సోషల్ డెమోక్రసీ నుండి వెలువడిన కార్మికవర్గ ఉద్యమం చిల్లర ఉద్యమం అవుతుంది, అనివార్యంగా బూర్జువా ఉద్యమం ఔతుంది; ఆర్థికపోరాటం మాత్రమే చేయడంలో కార్మికవర్గం తన రాజకీయ స్వాతంత్ర్యం కోల్పోతుంది; అది యితర పార్టీలకు తోక అయి, "కార్మికవర్గ విమోచనను కార్మిక వర్గమే జయించుకోవాలి" (ఫుట్ నోట్.7) అనే మహా సూత్రానికి ద్రోహం చేస్తుంది. కార్మికవర్గ ఉద్యమం సోషలిజంకు దూరంగా వుంటూ, రెండూ చెరొక దారినా పోయే దశ ఒకటి ప్రతిదేశంలోనూ వుండింది; ప్రతి దేశంలోనూ యీ యేకాకితనం సోషలిజంనూ, కార్మికవర్గ ఉద్యమాన్నీ రెంటినీ బలహీనపరిచింది. కార్మికవర్గ ఉద్యమంతో సోషలిజంయొక్క సమ్మేళనం మాత్రమే సకల దేశాలలోనూ రెంటికీ స్థిరమైన ఆధారాన్ని సృష్టించింది. కానీ, ప్రతి దేశంలోనూ సోషలిజం, కార్మికవర్గ ఉద్యమాల యీ సమ్మేళనం చారిత్రకంగా, సామ్యం లేని మార్గాలలో, దేశ కాల పరిస్థితుల ననుసరించి పరిణామం చెందింది. రష్యాలో, సోషలిజంనూ, కార్మికవర్గ ఉద్యమాన్నీ సమ్మేళనం చేయవలసిన అవసరం సిద్ధాంతరీత్యా యేనాడో ప్రకటింపబడింది, కానీ యిప్పుడే అది ఆచరణలోకి కొనిరాబడుతున్నది. అది చాలా కష్టమైన, ప్రక్రియ; అందువల్ల, దానివెంట ఊగిసలాటలూ, సందేహాలూ వుండడంలో ఆశ్చర్యం యేమీ లేదు.

గతం నుండి నేర్చుకోగల గుణపాఠం యేమిటి?

రష్యన్ సోషలిజంయొక్క చరిత్ర సమస్తమూ నిరంకుశ ప్రభుత్వంమీద పోరాటమూ, రాజకీయ స్వాతంత్ర్య సాధనా అత్యంత జరూరు కర్తవ్య మైనట్టి పరిస్థితికి దారితీసింది. మన సోషలిస్టు ఉద్యమం నిరంకుశత్వంతో చేసే పోరాటంమీద కేంద్రీకరించిందనవచ్చు. మరొకవైపున, సోషలిస్టు యోచన కార్మికవర్గ అగ్రదళానికి వెలిగా వుండడం యితర దేశాలలోకంటె రష్యాలో యెక్కువగా వుంది; యీ స్థితి కొనసాగితే, రష్యాలో విప్లవోద్యమం నిర్వీర్యం కాకతప్పదు. ఈ పరిస్థితి నుండి ఉద్భవిస్తున్నది రష్యన్ సోషల్ డెమోక్రసీ నిర్వహించవలసిన కర్తవ్యం - సోషలిజం భావాలనూ, రాజకీయ చైతన్యాన్నీ కార్మికవర్గ జనాలలోకి యెక్కించడమూ, స్వయంజనితమైన కార్మివర్గ ఉద్యమంతో విడదీయరాని సంబంధం గల విప్లవ పార్టీని నిర్మించడమూ అనే కర్తవ్యం. యీ దిశలో రష్యన్ సోషల్ డెమోక్రసీ చాలా చేసింది, కానీ చేయవలసింది యింకా చాలా వుంది. ఉద్యమ వృద్ధితో సోషల్ డెమోక్రట్ల కార్యరంగం విస్తృతమౌతుంది; పని యింకా వైవిధ్యపూరితమౌతుంది, ఉద్యమంలో అంతకంతకూ యెక్కువమంది కార్యకర్తలు ప్రచార ఆందోళనల దినదిన అవసరాలు ముందుకు తెచ్చే వివిధ ప్రత్యేక కర్తవ్యాలు పూర్తిచేయడంమీద కేంద్రీకరిస్తారు. యీ ఘటన యెంతో సహజమైనదీ, అనివార్యమైనదీ; కానీ యీ ప్రత్యేక కార్యకలాపాలూ, పోరాట పద్ధతులూ అవే లక్ష్యాలు కాకుండా నివారించే పనిలోనూ, సన్నాహక కృషి ప్రధాన కార్యంగానూ, ఏకైక కార్యంగానూ పరిగణింపబడకుండా నివారించే పనిలోనూ మనం మరీ లగ్నమయ్యేటట్లు చేస్తుంది యిది.

మన ప్రధాన, మౌలిక కర్తవ్యం యేమిటంటే, కార్మికవర్గ రాజకీయ అభివృద్ధికీ, రాజకీయ సంస్థా నిర్మాణానికీ దోహదం కలిగించడం. యీ కర్తవ్యాన్ని పూర్వరంగంలోకితోసేవాళ్లు,

సకల ప్రత్యేక కర్తవ్యాలనూ, నిర్దిష్ట పోరాట పద్ధతులనూ దీనికి లోబరచడానికి నిరాకరించేవాళ్లు, బూటకపు మార్గాన్ని అనుసరిస్తూ, ఉద్యమానికి తీవ్రమైన హాని కలిగిస్తున్నారు. మరి, మొదట, ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలో కార్మికవర్గ ఉద్యమంనుండి విడవడిన ఏకాకి క్షుద్ర బృందాల శక్తులను మాత్రమే వినియోగించాలని విప్లవకారులను ఉద్బోధించేవాళ్లు యీ కర్తవ్యాన్ని పూర్వ రంగంలోకి తోస్తున్నారు. రెండవది, రాజకీయ ప్రచార, ఆందోళన, సంస్థా నిర్మాణాల సారాన్నీ, విస్తృతినీ పరిమితపరిచేవాళ్లూ, కార్మికుల జీవితంలో అసాధారణ సమయాలలో మాత్రమే, వేడుక సందర్భాలలో మాత్రమే, వాళ్లకు "రాజకీయాలు" చెప్పడం ఉచితమని యెంచేవాళ్లూ, నిరంకుశత్వంతో చేసే రాజకీయ పోరాటం స్థానంలో నిరంకుశత్వంనుండి పాక్షిక సౌకర్యాల కొరకు డిమాండ్లను యెంతో ప్రాధేయ పూర్వకంగా పెట్టేవాళ్లూ, యీ పాక్షిక సౌకర్యాల కొరకు డిమాండ్లను నిరంకుశత్వంతో విప్లవ కార్మికవర్గ పార్టీచేసే క్రమబద్ధమైన, రాజీలేని పోరాటపు స్థాయికి నమ్మకంగా పెంచడానికి తగినంత చేయనివాళ్లూ యీ కర్తవ్యాన్ని పూర్వ రంగంలోకి తోస్తున్నారు.

"సంఘటితపడండి!" అని రకరకాల శ్రుతులలో 'రబోచయా మీస్ల్' కార్మికులకు పునశ్చరణ చేస్తూనే వుంది; "ఆర్థికవాద" ధోరణి అనుయాయులందరూ పునశ్చరణ చేస్తున్నారు. నిజమే, యీ ఉద్బోధను మనం పూర్తిగా ఆమోదిస్తాము; కానీ మనం మరొకటి కలపకుండా వుండము: సంఘటితపడండి, కానీ పరస్పర సహకార సంఘాలలోనూ, సమ్మె నిధులలోనూ, కార్మిక బృందాలలోనూ మాత్రమే కాదు; రాజకీయ పార్టీలో సంఘటితపడండి; నిరంకుశ ప్రభుత్వం మీద, మొత్తం పెట్టుబడిదారీ సమాజంమీద కృతనిశ్చయమైన పోరాటానికి సంఘటితపడండి. అలాంటి సంఘ నిర్మాణం లేకుండా కార్మికవర్గం యెన్నడూ వర్గచైతన్యపూరిత పోరాటానికి యెదగలేదు; అలాంటి సంఘ నిర్మాణం లేకుంటే కార్మికవర్గం నిర్వీర్యం కాకతప్పదు. నిధులూ, అధ్యయన బృందాలూ, పరస్పర సహకార సంఘాలూ తప్ప మరి దేని సహాయమూ లేకుంటే కార్మికవర్గం తన మహత్తర చారిత్రక కర్తవ్యాన్ని యెన్నడూ నిర్వహించజాలదు రాజకీయ, ఆర్థిక బానిసత్వంనుండి తననూ, మొత్తం రష్యన్ జాతినీ విమోచనచేసే కర్తవ్యాన్ని. చరిత్రలో యే ఒక్క వర్గమూ తన రాజకీయ నాయకులను సృష్టించకుండా, ఒక ఉద్యమాన్ని నిర్మించి, దానిని నడిపించగల తన ప్రముఖ ప్రతినిధులను సృష్టించకుండా, అధికారం సాధించలేదు. అలాంటి వ్యక్తులను సృష్టించగలనని రష్యన్ కార్మికవర్గం యిప్పటికే నిరూపించింది. గత అయిదారేండ్లలో అంత విస్తృతంగా అభివృద్ధి అయిన పోరాటం కార్మికవర్గంయొక్క మహత్తర గుప్త విప్లవశక్తిని వెల్లడించింది; అత్యంత నిర్దాక్షిణ్యమైన ప్రభుత్వ హింసలు సోషలిజంవైపూ, రాజకీయ చైతన్యంవైపూ, రాజకీయ పోరాటంవైపూ కృషిచేసే కార్మికుల సంఖ్యను తగ్గించదు సరికదా, తద్వ్యతిరేకంగా యెక్కువ చేస్తుంది అని అది చూపించింది. 1898లో మన కామ్రేడ్లు జరిపిన మహాసభ మన కర్తవ్యాలను సరిగా నిర్వచించింది; అది కేవలం యితరుల మాటలు పునశ్చరణ చేయలేదు, కేవలం "మేధావుల" ఉబలాటాన్ని వ్యక్తం చేయలేదు... పార్టీ కార్యక్రమమూ, నిర్మాణమూ, యెత్తుగడలూ అనే సమస్యను యీనాటి దినచర్యలో చేర్చి, యీ కర్తవ్యాలను పూర్తిచేయడానికి మనం కృతనిశ్చయంతో కృషి చేయాలి. మన కార్యక్రమం యొక్క మౌలిక సూత్రాలమీద మన అభిప్రాయాలను యిప్పటికే తెలియజేసినాము; యిక, సహజంగా, వాటిని సవివరంగా విశదీకరించడానికి యిది స్థలం కాదు. సంస్థా నిర్మాణ సమస్యలమీద, ఒక వ్యాస పరంపర వచ్చే సంచికలో రాయాలని అనుకుంటున్నాను. ఇది మనలను యెదుర్కొంటున్న సమస్యలలో ముఖ్యమైనది. యీ విషయంలో, రష్యన్ విప్లవోద్యమంలోని పాత కార్యకర్తలకంటె మనం గణనీయంగా వెనుకబడివున్నాము. యీ లోపాన్ని మనం మోమాటం లేకుండా ఒప్పుకొని, మన పనిలో మరింత రహస్యమైన పద్ధతులు రూపొందించడానికీ, సరైన పని పద్ధతులను, పోలీసుల కన్నుగప్పడానికీ పోలీసుల పన్నాగాలను తప్పించుకోడానికీ సరైన పద్ధతులను, క్రమబద్ధంగా వ్యాప్తిచేయడానికీ సకల ప్రయత్నాలూ చేయాలి. తమ తీరిక సాయంత్రాలనేగాక, తమ యావత్తు జీవితాలనూ విప్లవానికి అర్పించే వ్యక్తులను మనం తర్ఫీదు చేయాలి; మన పనిలోని వివిధ రూపాలలో ఖచ్చితమైన శ్రమవిభజనను ప్రవేశపెట్టడానికి వీలిచ్చేటంత పెద్ద సంస్థను మనం నిర్మించాలి. చివరన, యెత్తుగడల సమస్యలకు సంబంధించి, మనం యీ కింది వాటికి పరిమితమౌదాము: ముందుగా ఊహించిన యేదో ఒక రాజకీయ పోరాట రూపానికీ, పద్ధతికీ సోషల్ డెమొక్రసీ తన చేతులు కట్టి వేసుకోదు, తన కార్యకలాపాలు పరిమిత పరుచుకోదు; అది సకల పోరాట రూపాలనూ గుర్తిస్తుంది, ఆ రూపాలు పార్టీకి అందుబాటులో వున్న శక్తులకు అనుగుణంగా వుండి, ఆయా పరిస్థితులలో సాధ్యమైనంత ఉత్తమ ఫలితాల సాధనకు దోహదం కలిగించేటట్లైతే. మనకు పటిష్టంగా సంఘటితమైన పార్టీ వుంటే, ఒకే ఒక సమ్మె రాజకీయ ప్రదర్శనగా, ప్రభుత్వంమీద రాజకీయ విజయంగా మారవచ్చు. మనకు పటిష్టంగా సంఘటితమైన పార్టీ వుంటే, ఒకే ఒక ప్రాంతంలోని తిరుగుబాటు విజయవంతమైన విప్లవంగా పెరగవచ్చు. మనం గుర్తుపెట్టుకో వలసింది యేమిటంటే, పాక్షిక డిమాండ్ల

కొరకూ, కొన్ని సౌకర్యాల సాధనకొరకూ ప్రభుత్వంతో చేసే పోరాటాలు శత్రువుతో చిన్న ఘర్షణలు మాత్రమే, రాణాలమధ్య ఘర్షణలు మాత్రమే, కానీ నిర్ణయాత్మక యుద్ధం యింకా రావలసివుంది. శత్రు దుర్గం బలసంపన్నంగా మన ముందు నిటారుగా వుంది; అది తుపాకి గుండ్లూ, ఫిరంగి గుండ్లూ మనమీద వర్షిస్తూ మన ఉత్తమ యోధులను నేలకూలుస్తున్నది. మనం యీ కోటను పట్టుకోవాలి; జాగృత కార్మికవర్గపు సమస్త శక్తులనూ రష్యన్ విప్లవకారుల సమస్త శక్తులతో కలిపి, రష్యాలో ప్రాణప్రదమైన, నిజాయితీ అయిన సమస్తాన్నీ ఆకర్షించే ఏకైక పార్టీగా మనం సమైక్యం చేస్తే, యీ కోటను మనం తప్పక పట్టుకుంటాము. అప్పుడే రష్యన్ కార్మిక విప్లవకారుడైన ప్యోత్ర్ అలెక్సేయెవ్ (ఫుట్‌నోట్.8) యొక్క యీ మహత్తర జోస్యం నిజమౌతుంది: "లక్షోపలక్షల కార్మికుల మాంసల బాహుదండం పైకి లేస్తుంది, సైనికుల సన్నీలతో పరిరక్షితమైన నిరంకుశత్వపు నిగళాలు చూర్ణమౌతాయి!"

రచన: నవంబర్ 1900 తొలి భాగం

ప్రచురణ: డిసెంబర్ 1900, 'ఇస్క్రా' నం.1

**<u>ఫుట్‌నోట్స్ :</u>**

**1** *'శ్రమ విమోచన' బృందం - రష్యాలో మొట్టమొదటి మార్క్సిస్టు గ్రూపు. ఇది 1883లో జి.వి. ప్లెహానొవ్‌చేత జెనీవాలో స్థాపించబడింది. ఆర్.యస్.డి.యల్.పి. రెండవ మహాసభ (1903) దాకా యీ బృందం వుండింది.*

**2** *మార్చి 1898, మీన్స్క్‌లో ఆర్.యస్.డి.యల్.పి. మొదటి మహాసభ జరిగింది. దానిలో ఆరు స్థానిక సోషల్ డెమోక్రటిక్ సంస్థలనుండి తొమ్మిదిమంది పాల్గొనినారు. స్థానిక సంస్థలు 'రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ'గా సమ్మేళనం కావాలని మహాసభ నిర్ణయం చేసింది.*

**3** 'Credo' *అనే పత్రంలో "ఆర్థికవాదులు" తమ భావాలను వ్యక్తం చేసినారు. (ఆర్థికవాదులు-19వ శతాబ్ది అంతం, 20వ శతాబ్ది ప్రారంభంలో రష్యన్ సోషల్ డెమోక్రట్లలో యేర్పడిన అవకాశవాదధోరణి). జారిజానికి వ్యతిరేకంగా రాజకీయ పోరాటం లిబరల్ బూర్జువావర్గం చేయాలనీ, కార్మికులు కేవలం పని పరిస్థితుల మెరుగుదలకూ, వేతనాలు పెంచడానికీ, పనిగంటలు తగ్గించడానికీ ఆర్థిక పోరాటానికి పరిమితం కావాలనీ ఆర్థికవాదులు అభిప్రాయపడినారు. కార్మికవర్గ స్వతంత్ర రాజకీయ పార్టీని స్థాపించడానికి వ్యతిరేకంగా వుండి, కార్మికవర్గ ఉద్యమంలో విప్లవ సిద్ధాంత ప్రాముఖ్యతను నిరాకరించినారు. ఆర్థికవాదుల తప్పు అభిప్రాయాలను 1902లో వెలువడిన 'ఏమి చేయాలి?', తదితర రచనలలో లెనిన్ ఖండించినాడు.*

**4** *'రబోచయా మీస్ల్' ('కార్మిక చింతన') -ఆర్థికవాదుల పత్రిక; 1897-1902లో వెలువడింది.*

**5** *'నరోద్నయ వోల్య' ('ప్రజా అభీష్టం') - 1879లో స్థాపించబడిన రహస్య విప్లవపార్టీ. నిరంకుశ పరిపాలనను కూలదోయడం, రాజకీయ స్వేచ్ఛను ప్రవేశపెట్టడం దీని లక్ష్యాలు. జారిజంతో సాగిస్తున్న పోరాటంలో యీ పార్టీకి చెందినవాళ్లు వ్యక్తిగత టెర్రరిజం ముఖ్య పద్ధతిగా భావించినారు. ప్రజలతో సంబంధాలు లేని విప్లవకారుల గ్రూపు కుట్రలద్వారా, టెర్రరిస్టు చర్యలద్వారా నిరంకుశ పరిపాలనను కూలదోయ వచ్చునని వాళ్లు దురభిప్రాయపడినారు.*

**6** *బెర్న్‌స్టైనిజం-జర్మన్, అంతర్జాతీయ సోషల్ డెమోక్రసీలో జర్మన్ సోషల్ డెమోక్రట్ ఎడువార్డ్ బెర్న్‌స్టైన్ స్థాపించిన అవకాశ ధోరణి. అతను సోషలిస్టు విప్లవాన్ని గురించీ, మార్క్సిజం యొక్క మౌలిక సూత్రాలను రద్దుచేయాలనీ, పునర్విమర్శ చేయాలనీ డిమాండు చేసినాడు. సోషల్ డెమోక్రసీ సోషలిజం కోసం పోరాటాన్ని వదలిపెట్టి, పెట్టుబడిదారీ విధాన చట్రాలలో కొన్ని సంస్కరణలకోసం మాత్రమే ప్రయత్నించాలని యీ ధోరణి ప్రతిపాదన చేసింది.*

**7** *మార్క్స్ రాసిన 'అంతర్జాతీయ కార్మికుల సంఘం సాధారణ నిబంధనావళి' నుండి ఉల్లేఖన.*

**8** *అలెక్సేయెవ్, ప్యోత్ర్-రష్యన్ విప్లవకారుడు, వృత్తిరీత్యా సాలీడు; 1875లో అరెస్టుచేయబడి, కోర్టులో ఉత్సాహపూరితమైన ఉపన్యాసం చేసినాడు. ఆ ఉపన్యాసంలో ముగింపు మాటలు లెనిన్ ఉల్లేఖిస్తున్నాడు.*

ooo